క్లుప్తంగా

భీమ్‌గల్ విద్యార్థికి విట్‌లో అర్హత



భీమ్‌గల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఈసీ చదివిన విద్యార్థి నిఖిల్ వెల్లూర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (చెన్నై) బీకామ్ ఆనర్స్ విభాగంలో అర్హత సాధించాడు. నిఖిల్‌ను ప్రిన్సిపాల్ చిరంజీవి, అధ్యాపకులు గురువారం సన్మానించారు. కార్యక్రమంలో కృష్ణదాస్, మండలోజు, నరసింహ స్వామి, శ్రీనివాస్ గౌడ్, సత్యనారాయణ, జాన్ పాల్గొన్నారు.

పనులను పర్యవేక్షించాలి

రెంజల్: ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న మరమ్మతు పనులను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించాలని ఎంపీడీవో శ్రీనివాస్ సూచించారు. మండలంలోని కూనేపల్లి, వీరన్నగుట్ట, కళ్యాపూర్, దండిగుట్ట గ్రామాల్లోని పాఠశాలల్లో జరుగుతున్న పనులను గురువారం పరిశీలించారు. అధికారులు, సిబ్బంది ఉన్నారు.

దివ్యాంగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

బోధన్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, పెంచుతామన్న పింఛన్లను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువా రం సాలూర మండల తహసీల్ ఎదుట వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో దివ్యాంగులు ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ రమేశ్‌కు వినతిపత్రం అందించారు. వేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు యేశాల గంగాధర్, గైని రాములు, షేక్ నజీర్, సింగాడి లక్ష్మణ్, చందు, దివ్యాంగులు పాల్గొన్నారు.

విద్యార్థులపై దాడి అమానుషం

వర్ని: జిల్లాలో విద్యార్థి సంఘాల నాయకులపై పోలీసుల దాడిని, విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వ తీరుని సీపీఎం వర్ని ఏరియా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని పార్టీ ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ అన్నారు. మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ తీరుకు గురువారం నిరసన తెలిపారు. ప్రధాని మోదీ, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విద్యార్థి లోకానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

ఐదెకరాలకే రైతు భరోసాను పరిమితం చేయాలి



రెంజల్: ఐదెకరాల వరకే రైతు భరోసాను పరిమితం చేయాలని పలువురు రైతులు మహాజన సభలో తీర్మానించారు. మండలంలోని రెంజల్, నీలా, దూపల్లి విండో చైర్మన్లు మొయినొద్దీన్, ఇమాంబేగ్, భూంరెడ్డిల అధ్యక్షతన గురువారం ప్రత్యేక మహాజన సభలు నిర్వహించారు. రైతు భరోసాపై ఆయా గ్రామాల రైతుల అభిప్రాయాలను అధికారులు సేకరించారు. కార్యక్రమంలో కార్యదర్శులు రాము, రాందాస్, జీవన్‌రెడ్డి, విండో పాలక వర్గ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి జయంతి



రెంజల్: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని మండలంలోని బోర్గాంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. గ్రామంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పుట్టి నాగన్న, పార్వతి రాజేశ్వర్, ఒడ్డెన్న, నసీర్, పెద్దులు, పోశెట్టి, గోపాల్, హైమద్ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన నాయకులు

బాల్కొండ: జనతాదళ్ వ్యవస్థాపకుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకొని మండల శివారులోని సాయిబాబా ఆలయ ఆవరణలో బీజేపీ నాయకులు గురువారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ మల్కన్న గారి మోహన్, నిమ్మల శ్రీనివాస్, అంబటి నవీన్, చందు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

బాల్కొండ: మెండోరా మండల కేంద్రానికి చెందిన రాజారెడ్డి కిడ్నీ సంబంధిత వ్యాధితో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రూ. లక్షాపదివేల మంజూరుకు కృషి చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందించిన రూ.లక్షాపదివేల ఎల్‌వోసీని బాధిత కుటుంబీకులకు గురువారం అందజేశారు. ఆపద సమయంలో ఆదుకున్న ప్రభుత్వానికి, ఎల్‌వోసీ మంజూరుకు కృషి చేసి సునీల్‌రెడ్డి బాధిత కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

పదవులు శాశ్వతం కాదు

- చేసిన సేవలే ప్రజలకు గుర్తుంటాయి
- పదవీ కాలం ముగిసిన పరిషత్ ప్రజాప్రతినిధుల సన్మాన సభల్లో వక్తలు

పదవులు వస్తుంటాయి పోతుంటాయి, కానీ వారు చేసిన మంచి పనులు, సేవలే ప్రజలకు గుర్తుంటాయని పలువురు వక్తలు అన్నారు. పదవి లేకపోయినా ప్రజాసేవలో కొనసాగాలన్నారు. మండల పరిషత్ ప్రజాప్రతినిధుల ఐదేళ్ల పదవీ కాలం ముగియడంతో ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లోని ఆయా మండలాల్లో ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్‌ఎంపీపీ, ఎంపీటీసీ, కో–ఆప్షన్ సభ్యులను పలువురు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు చేసిన సేవలను కొనియాడారు.



ఆలూర్‌లో స్థానిక నాయకులు

బాల్కొండ/ పెర్కిట్/ మాక్లూర్/ రెంజల్: పదవులు ఉన్నా.. లేకున్నా ప్రజా సేవలో కొనసాగాలని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బాల్కొండ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఐదేళ్ల పదవీ కాలం ముగిసిన ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలకు వీడ్కోలు సమావేశం గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు ఎక్కడా అవినీతికి పాల్పడకుండా ప్రజాసేవలో తరించిపోయారని అన్నారు. ప్రజల కోసం నిరంతరం పనిచేశారని వారి సేవలను కొనియాడారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలన కుంటుపడుతోందన అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చి రైతులకు రూ. రెండు లక్షల రుణమాఫీని వెంటనే అమలు చేయాలన్నారు. అనంతరం ప్రజాప్రతినిధులను



మాక్లూర్‌లో ఎంపీటీసీని సన్మానిస్తున్న నాయకులు



బాల్కొండలో ఎంపీపీ, జెడ్పీటీసీలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

ఘనంగా సన్మానించారు. పార్టీ మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలూర్ మండల కేంద్రంలో ఎంపీటీసీలను స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు. జీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ మోతె భోజకళ చిన్నా రెడ్డి, మర్కంటి లక్ష్మీమల్లేశ్‌ను నాయకులు సన్మానం చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ కళ్లెం మోహన్ రెడ్డి, ఉప సర్పంచ్ దుమ్మాజి శ్రీనివాస్, కార్యదర్శి రాజలింగం, ఐకేపీ సీసీ మనోహర్, ట్రాన్స్‌కో లైన్‌మెన్ శివ, కారోబార్ సంతోష్, ఈజీఎస్ సిబ్బంది పోశెట్టి, మాజీ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మాక్లూర్‌లో ఎంపీటీసీ ఎస్ వెంకటేశ్వర్‌రావును స్థానిక కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రవి ప్రకాశ్, మాక్లూర్ మాజీ సర్పంచ్ రాజు, జైల్‌సింగ్, అలీమ్, రామాగౌడ్, ఆరీఫ్, రవిగౌడ్, అనిల్, సందీప్, రాజ్‌మల్లయ్య, నరేందర్, లక్ష్మణ్, పట్నం సాయిలు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రెంజల్ మండలంలో పదవీకాలం పూర్తి చేసుకున్న ఎంపీటీసీలను అధికారులు, రైతులు ఘనంగా సన్మానించారు. నీలా గ్రామంలో కందకుర్తి ఎంపీటీసీ అసద్‌బేగ్‌తో పాటు నీలా ఎంపీటీసీ స్వప్న భర్త రాంచందర్‌లకు పూలమాలలు వేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నీలా విండో చైర్మన్ ఇమాంబేగ్, వ్యవసాయాధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు రాఘవేందర్, ముఖీద్‌బేగ్, శ్రీనివాస్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్యకు ఘన నివాళి



బోధన్‌లో కొమురయ్య చిత్ర పటానికి పూలమాలలు వేస్తున్న నాయకులు



ఆర్మూర్‌లో సీపీఎం నాయకులు

బోధన్/ ఆర్మూర్‌టౌన్/ నందిపేట్: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని బోధన్‌లోని పాన్‌గల్లీలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ సహాయ కార్యదర్శి మల్లేశ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఆర్మూర్ పట్టణంలో సీపీఎం ఆర్మూర్ డివిజన్ కమిటీ సభ్యులు దొడ్డి కొమురయ్య వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేశ్, ఎల్లయ్య, రవి, సుజాత, కుల్దీప్ శర్మ, చింటు, శ్రావణ్ కుమార్, బంటి తదితరులు పాల్గొన్నారు. ఆర్మూర్ పట్టణంలోని కుమార్ నారాయణభవన్‌లో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా కార్యక్రమంలో దొడ్డి కొమురయ్య వర్ధంతి సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యుడు ప్రభాకర్, నాయకులు దేవరాం, ముత్తెన్న, సురేశ్, సత్తెక్క తదితరులు పాల్గొన్నారు. నందిపేట మండలంలోని చౌడమ్మ కొండూరులో ప్రజాపంథ ఆధ్వర్యంలో భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడిన దొడ్డి కొమురయ్య వర్ధంతి సభ నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రజాపంథ రాష్ట్ర నాయకుడు కె గంగాధర్, కురుమ యాదవ సంఘం యూత్ సభ్యులు పాల్గొన్నారు.



వర్ధంతి సభలో మాట్లాడుతున్న ప్రభాకర్



నందిపేటలో నివాళి అర్పిస్తున్న ప్రజాపంథ నాయకులు

నీటి సమస్యను పరిష్కరించాలి



నీరులేని మినీ ట్యాంకు

రుద్రూర్: మండల కేంద్రంలోని చెరువు కట్ట సమీపంలో ఉన్న వీధిలో నీటి సమస్య తీర్చాలని కాలనీ వాసులు కోరుతున్నారు. నెల రోజులుగా మినీ వాటర్ ట్యాంక్ నుంచి రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మిషన్ భగీరథ కుళాయిలు సరిగా రావడం లేదని, దీంతో పక్కనే ఉన్న వీధుల్లోకి వెళ్లినా నీరు దొరకడం లేదన్నారు. ఈ విషయమై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోతోందన్నారు. బోరు ఎండిపోయిందని చేతులెత్తేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై జీపీ కార్యదర్శి గంగాధర్‌ను వివరణ కోరగా బోరులో నీరు లేనందున రెండు మినీ వాటర్ ట్యాంకుల్లోకి నీరు రావడం లేదన్నారు. తాత్కాలికంగా జీపీ వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని సరాఫరా చేస్తామన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



నూత్‌పల్లిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు



తట్టికోట పాఠశాలలో వైద్య సిబ్బంది

డొంకేశ్వర్/ బోధన్/ వేల్పూర్/ నవీపేట: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని డొంకేశ్వర్ మెడికల్ ఆఫీసర్ విద్యాసాగర్ విద్యార్థులకు సూచించారు. డొంకేశ్వర్ మండలంలోని నూత్‌పల్లి బీసీ బాలుర గురుకుల పాఠశాలలో డెంగీ, మలేరియా, విషజ్వరాలపై అవగాహన కల్పించారు. దోమలు కుట్టకుండా హాస్టల్ గదులకు దోమ తెరలు వాడాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్లు సురేందర్, ప్రమీల, ప్రిన్సిపాల్ లక్ష్మణ్ గౌడ్ పాల్గొన్నారు. జాతీయ డెంగీ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణ కేంద్రంలోని తట్టికోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏకచక్రనగర్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యసిబ్బంది వ్యాధి నియంత్రణ, ముందస్తు జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ సుజాత, పాఠశాల హెచ్‌ఎం కిశోర్ కుమార్, ఏఎన్‌ఎంలు శాంత, రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వేల్పూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది శంకర్, నాగమణి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కీటక జనిత వ్యాధులపై వైద్య శాఖ ఆధ్వర్యంలో గురువారం నవీపేటలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ స్రామాట్, సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వర్‌రావు, సూపర్‌వైజర్ కిషన్ పాల్గొన్నారు.

బాసర ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక

రెంజల్: రెంజల్ ఆదర్శ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు గోర్‌బాగ్ అక్షిత, కరీమాబేగం బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. గురువారం పాఠశాలలో ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బలరాం, పీడీ ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పింఛన్లు పెంచకపోతే సీఎం ఇల్లు ముట్టడిస్తాం



మాట్లాడుతున్న సుజాత సూర్యవంశి

నవీపేట: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వికలాంగులకు చెల్లిస్తున్న పింఛన్లను పెంచకపోతే సీఎం ఇల్లు ముట్టడిస్తామని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశి అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దుర్భర జీవితం గడుపుతున్న దివ్యాంగులకు రూ. 4 వేల నుంచి రూ. 6 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వికలాంగుల సమస్యలపై ఈనెల 5న జిల్లా కలెక్టరేట్‌ల ఎదుట ధర్నా చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మానికొల్ల గంగాధర్, లక్ష్మణ్, ప్రకాశ్, సుమన్, రమణ, అబ్బాపూర్ సాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

బంద్ విజయవంతం



బోధన్‌లో ప్రభుత్వ పాఠశాల ఎదుట నాయకులు



వర్నిలో మాట్లాడుతున్న నాయకులు

బోధన్/ ఆర్మూర్‌టౌన్/ వర్ని/ బాల్కొండ: నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి నిరసనగా విద్యార్థి సంఘాల జేఏసీ దేశ వ్యాప్త విద్యా సంస్థల బంద్‌లో భాగంగా గురువారం బోధన్, ఆర్మూర్, వర్ని, బాల్కొండలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలను విద్యార్థి సంఘాల నాయకులు బంద్ చేయించారు. ఏఐఎస్‌ఎఫ్, పీడీఎస్‌యూ, ఏబీవీపీ ఎస్‌యూ, ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎఫ్‌డీఎస్ డివిజన్ కమిటీల ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. ఈ క్రమంలో విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని పీఎస్‌కు తరలించారు. వారిని అరెస్టు చేసి విడుదల చేశారు. ఆర్మూర్‌లో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. జాతీయ స్థాయి పరీక్ష విధానాన్ని రద్దు చేయాలన్నారు.

ఘనంగా లక్కీషా జయంతి



నివాళులు అర్పిస్తున్న నాయకులు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ హాస్టల్‌లో గురువారం తెలంగాణ నవ నిర్మాణ విద్యార్థిసేన ఆధ్వర్యంలో ఎర్రకోట నిర్మాణ కర్త అయిన లక్కీషా బంజారా జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బంజారా ఖ్యాతిని తెలుసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని విద్యార్థి సేన జిల్లా సంయుక్త కార్యదర్శి వెంకటేశ్ అన్నారు. కార్యక్రమంలో నాయకులు అరవింద్, శశి తదితరులు పాల్గొన్నారు.

విద్యాబోధనపై శిక్షణ



మాట్లాడుతున్న సీడీపీవో జానకి

బోధన్: పట్టణ కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో పూర్వ ప్రాథమిక విద్యా బోధన అంశంపై ఐసీడీఎస్ ప్రాజెక్టు శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సీడీపీవో జానకి మాట్లాడుతూ.. తమ శాఖ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు పూర్వ ప్రాథమిక విద్య బోధన పద్ధతులపై అవగాహన కల్పించేందుకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సమాచారం..

■ నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బోధన్‌రూరల్: మండలంలోని పెగడపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని బోధన్ ట్రాన్స్‌కో ఏడీఈ బెనర్జీ తెలిపారు. భూలక్ష్మి క్యాంప్, పెగడపల్లి, లంగ్డాపూర్, బర్దీపూర్, పెంటాకలాన్ గ్రామాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 వరకు విద్యుత్ సరఫరా ఉండదని వెల్లడించారు. నేషనల్ హైవే 161బీబీ రోడ్డు అభివృద్ధి పనుల్లో భాగంగా 33కేవీ లైన్ షిఫ్టింగ్ కోసం కరెంట్ సరఫరాలకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. విషయాన్ని గ్రామస్తులు గమనించి సహకరించాలని కోరారు.

■ మెండోరాలో ప్రజావేదిక..

బాల్కొండ: మెండోరా మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయం ఎదుట శుక్రవా రం ఉపాధి హామీ పథకం ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వనజ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ చేసిన డీఆర్పీలు ప్రజా వేదికలో వివరిస్తారన్నారు. కూలీలు, గ్రామస్తులు పాల్గొనాలని కోరారు.

■ దరఖాస్తుల ఆహ్వానం

వర్ని: మండలంలోని మహాత్మ జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పద్మజ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024–25 విద్యా సంవత్సరానికి గాను బీఏలో ఈపీహెచ్, ఈపీపీ, బీఎస్సీలో బీజెడ్‌సీ, ఎంపీసీ, ఎంఎస్‌సీఎస్, ఎంపీసీఎస్, బీకాంలో బిజినెస్ ఎనాలసిస్, కంప్యూటర్ కోర్సుల నందు సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 8లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఐటీఐలో..

భీమ్‌గల్: పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సెకండ్ ఫేజ్ అడ్మిషన్ లకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్, కోపా కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా స్వీకరిస్తున్నట్లు వెల్లడించారు. మరిన్ని వివరాలకు 9494560090, 9908899127, 850043174 నంబర్లను సంప్రదించాలని కోరారు.

రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం



రుద్రూర్: రుద్రూర్, కోటగిరి మండలాల్లో ఏఐసీసీ నేత, ఎంపీ రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు గురువారం రాత్రి దహనం చేశారు. పార్లమెంట్ సభలో హిందూ సమాజాన్ని హేళనగా మాట్లాడిన రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని నినాదాలు చేశారు. కార్యక్రమాల్లో పార్టీ మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని పూర్తి చేయాలి

రుద్రూర్: ఆశా కార్యకర్తలకు కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని కోటగిరి ఉమ్మడి మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ సూచించారు. పాతంగల్ మండల కేంద్రంలో ఆశా కార్యకర్తలతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. వివిధ శాఖల సిబ్బందితో సమన్వయంగా ఉంటూ ఇచ్చిన టార్గెట్ పూర్తి చేయాలన్నారు. సమావేశంలో హెల్త్ సూపర్‌వైజర్లు సాయికుమారి, జ్యోతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ప్రత్యేకాధికారులు



మెండోరాలో బాధ్యతలు స్వీకరిస్తున్న రాజనర్సయ్య

బాల్కొండ: ఎంపీపీల పదవీకాలం ముగియడంతో ఆయా మండలాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో మండల ప్రత్యేకాధికారులు గురువారం బాధ్యతలు చేపట్టారు. బాల్కొండలో రసూల్‌బీ, ముప్కాల్‌లో శ్రీనివాస్, మెండోరాలో రాజనర్సయ్య బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారిని సిబ్బంది సన్మానించారు. కార్యక్రమాల్లో ఎంపీడీవోలు విజయ్‌భాస్కర్‌రెడ్డి, ముజాఫర్, వనజ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాక్లూర్‌లో ముత్తెన్న



మాక్లూర్: మండల ప్రత్యేక అధికారిగా ముత్తెన్న గురవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జె క్రాంతి, ఎంపీవో టి శ్రీనివాస్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఆయనకు స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో మోహన్, ఎండల రాజేశ్, రమేశ్ పాల్గొన్నారు.

రుద్రూర్‌లో సాయిబాబా



రుద్రూర్‌లో సాయిబాబాను సన్మానిస్తున్న సిబ్బంది

రుద్రూర్: కోటగిరి మండల ప్రత్యేకాధికారిగా బోధన్ డీఎల్‌పీవో వి సాయిబాబా బాధ్యతలు స్వీకరించారు. మండల అభివృద్ధి అధికారి మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది ప్రత్యేకాధికారిని సన్మానించారు. రుద్రూర్ మండల ప్రత్యేకాధికారిగా జిల్లా ఎస్సీ కార్పొరేషన్ అధికారి శశికళ బాధ్యతలు స్వీకరించినట్లు ఎంపీడీవో సురేశ్ బాబు పేర్కొన్నారు.

నవీపేటలో మల్లికార్జున్

నవీపేట: మండల ప్రత్యేక అధికారిగా జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి మల్లికార్జున్ బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగనాథ్, ఎంపీవో రామకృష్ణ, సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రావు, పీఆర్ఏఈ శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని సంతోష్‌నగర్ కాలనీలో ఉన్న తోలుపరిశ్రమ స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నిస్తున్న వారిపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని మాదిగ సంఘాల యూనైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెర భూమన్న కోరారు. పట్టణంలోని తహసీల్ కార్యాలయానికి వచ్చిన కలెక్టర్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. నాయకులు వెంకటేశ్, ఎల్లన్న పాల్గొన్నారు.

సినిమాలు | తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	డెస్పికెబుల్ మీ4 (తెలుగు) – 11.40, 2.00, 4.20, 6.40, 9.00
స్క్రీన్-2 –	కల్కి ఏడి–2898 (3డీ తెలుగు) – 10.45, 2.30, 6.15, 10.00
స్క్రీన్-3 –	కల్కి ఏడి–2898 (తెలుగు) – 10.00, 1.45, 5.30, 9.15
స్క్రీన్-4 –	కల్కి–2898 (తెలుగు) – 11.30, 3.15, 7.00, 10.45